జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 24 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 2

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి


- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 23, (ప్రజాజ్యోతి )** నేడు సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు, కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం లో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

# పోచమ్మ గుడి బోనాలు

- 6,7 వార్డుల నడుమ ఉన్న పోచమ్మ గుడిలో బోనాలు సమర్పణ
- భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ప్రజలందరినీ చల్లగా చూడాలని మొక్కుకున్న భక్తులు



**ఇల్లందు, ఆగస్ట్ 23 (ప్రజాజ్యోతి )** పట్టణంలోని 6, 7వ వార్డుల నడుమ కొలువుదీరిన పోచమ్మ తల్లి ఆలయంలో బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. మహిళలు, భక్తులు సంప్రదాయబద్ధంగా బోనాలను సిద్ధం చేసుకోని అమ్మవారి సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరావడంతో పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు పసుపు, కుంకుమలతో అమ్మవారిని అలంకరించి, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలో బోనాల పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ తదితర గ్రామదేవతలకు బోనాలు సమర్పించడం తరతరాలుగా కొనసాగుతున్న ఆచారంగా భావిస్తారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, ఎలాంటి అనారోగ్యాలు, ఆపదలు దరిచేరకుండా అమ్మవారు కాపాడాలని కోరుతూ భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా 6, 7వ వార్డులకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. తమ కుటుంబాలతో పాటు ప్రజలందరినీ చల్లగా చూడాలని, పట్టణ ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని భక్తులు పోచమ్మ తల్లిని వేడుకున్నారు. బోనాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, నైవేద్య సమర్పణతో పాటు భక్తుల మొక్కుబడులు కొనసాగాయి. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రాంతం సుభిక్షంగా ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ వేడుకలతో 6, 7వ వార్డుల్లో పండుగ సందడి నెలకొంది. భక్తులు భక్తిభావంతో పాల్గొని పోచమ్మ తల్లి ఆశీస్సులు పొందారు.

## గంజాయి సేవిస్తూ పట్టుబడిన ముగ్గురు

- పునరావాస కేంద్రానికి తరలింపు



**బూర్గంపహాడ్,ఆగస్టు23 (ప్రజా జ్యోతి ):** గంజాయి సేవిస్తూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు పునరావాస కేంద్రానికి తరలించారు.మండలంలోని తాళ్లగొమ్మూరు ఐటీసీ జామాయిల్ ప్లాంటేషన్ వద్ద గంజాయి సేవిస్తున్న గడికొప్పుల శశి కుమార్, సోము సీతారామిరెడ్డి, మహమ్మద్ అఫ్రోజ్ లను బూర్గంపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల్లో గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో భద్రాచలంలోని పునరావాస కేంద్రానికి తరలించినట్లు ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపారు. మండలంలో గంజాయి సేవించడం, విక్రయించడం వంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

## ఏఎన్ఎంకు మహిళల ఘన సన్మానం



**చర్ల , ఆగస్టు 23 :(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని దానవాయి పేట పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌లో విధులు నిర్వహించిన ఏఎన్ఎం కొమరం గాధెమ్మ (గాయత్రి) సిస్టర్‌కు గ్రామ మహిళలు ఆదివారం ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. చాలా సంవత్సరాలుగా దానవాయి పేట సబ్‌సెంటర్‌లో విధులు నిర్వహిస్తూ గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు విశేష ఆరోగ్య సేవలు అందించిన గాధెమ్మ సిస్టర్ ఇటీవల బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆదివారం దానవాయిపేట సబ్‌సెంటరలో వార్డ్ సభ్యురాలు కణితి రజిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ మహిళలు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా వార్డ్ సభ్యురాలు కణితి రజిని మాట్లాడుతూ, గాధెమ్మ సిస్టర్ గ్రామానికి కేవలం ఏఎన్ఎం మాత్రమే కాదని, గ్రామ ప్రజల కుటుంబ సభ్యురాలిగా సేవలందించారని అన్నారు. గర్భిణీలను సొంత బిడ్డల్లా చూసుకుంటూ ప్రసవాలు, టీకాలు, ఆరోగ్య సలహాలు తదితర అంశాల్లో ఎల్లప్పుడూ అండగా నిలిచారని కొనియాడారు. ఆమె బదిలీ గ్రామానికి తీరని లోటని అన్నారు.గ్రామంలో ఎవరికైనా ఆరోగ్య సమస్య తలెత్తితే పగలు, రాత్రి అనే తేడా లేకుండా సేవలందించిన గాధెమ్మ సిస్టర్ సేవలను గ్రామస్తులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ సోయం జానకమ్మ, మహిళా సంఘం సభ్యులు మడకం స్వరూప, కణితి సోనీ, మడకం కవిత, కుంజ భవాని, చింతకాయల సంధ్య, మడకం శిరీష, కారం నాగలక్ష్మి , కణితి పుష్ప, మడవి అనూష, నూపా సుమలత, కారం కావేరి, కారం ఉషారాణి, కారం శ్యామల, మల్లం సమ్మక్క, మడకం పెద్ద సమ్మక్క, చిన్న గొర్ల కృష్ణవేణి, శిరీష, మట్ట మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి : ఎంపీడీవో డి. రాజేశ్వరి
- రైతు వేదికలో నేడు ప్రజావాణి




**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 23 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండలంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి. రాజేశ్వరి తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వెళ్లి క్యూలో నిలుచునే అవసరం లేకుండా మండలస్థాయిలోనే వినతులు స్వీకరించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వివిధ శాఖలకు చెందిన అధికారులు రైతు వేదికలో ఒకే వేదికపై ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించనున్నారు. ప్రజావాణికి ఎంపీడీవో, తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి, వ్యవసాయ అధికారి, విద్యుత్ శాఖ ఏఈ, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, మండల విద్యాధికారి, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది. వచ్చిన ప్రతి అర్జీని కంప్యూటర్‌లో నమోదు చేసి అర్జీదారుడికి స్వీకరణ పత్రం అందజేయనున్నారు. సమస్య తీవ్రతను బట్టి సంబంధిత అధికారులు పరిష్కరించి, ఆ వివరాలను అర్జీదారుడికి తెలియజేయనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై వినతులు అందజేయాలని ఎంపీడీవో డి. రాజేశ్వరి కోరారు.

# ఆళ్ళపల్లి-అనిశెట్టిపల్లి డబుల్ రోడ్డుకు రూ.98.80 కోట్ల మంజూరు

- మంత్రి పొంగులేటికి, ఎమ్మెల్యే పాయంకు పాలాభిషేకం





**ఆళ్ళపల్లి, ఆగస్టు 23 (ప్రజాజ్యోతి)** ఆళ్ళపల్లి నుంచి అనిశెట్టిపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.98.80 కోట్లు మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఇందు కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవతో ఆళ్ళపల్లి–అనిశెట్టిపల్లి డబుల్ రోడ్డు మంజూరు కావడం ఆనందదాయకమన్నారు.ఆళ్ళపల్లి నుంచి కిన్నెరసాని వంతెన వరకు రూ.30.21 కోట్లు, కిన్నెరసాని వంతెన నుంచి అనిశెట్టిపల్లి వరకు రూ.68.67 కోట్లతో మొత్తం రూ. 98.80 కోట్ల వ్యయంతో రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో పలు అంతర్గత రహదారుల నిర్మాణాలు పూర్తయ్యాయని, ఆళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.35 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం,రూ.38లక్షలతో ఐసీడీఎస్ భవన నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు.అనంతరం ఆళ్ళపల్లి బస్టాండ్ సెంటర్ లో బాణాసంచా కాల్చి మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సులకతాటి శ్రీను, వాసం సుష్మిత, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, మగలబోయిన సతీష్, వీరభద్రాచారి, లాలు, వాసు శ్రీకాంత్, మహమ్మద్ అతహర్, ముత్తిలింగం, భరత్, నాగేశ్వరరావు, ప్రశాంత్, మల్లరాజు సాయి, మంగ, పర్వీన్, సునీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలి

- జీవో 97ను రద్దు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి




**అశ్వాపురం, ఆగస్టు 23: ప్రజాజ్యోతి** తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను 'శక్తి' లో విలీనం చేసే అంశంపై ప్రభుత్వం పునరాలోచించాలని మాల జన సమితి పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టి సురేష్ కోరారు. పాలిటెక్నిక్ విద్య ద్వారా విద్యార్థులు తక్కువ సమయంలో సాంకేతిక నైపుణ్యాలు పొందడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారని తెలిపారు.డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యను విలీనం చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీవో 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలని చెట్టి సురేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మేకల భాస్కర్, కరకపల్లి డేవిడ్, ధ్రువకుమార్, చెట్టి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి పేరుతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం

- పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించాలి
- తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి పూకంటి రవికుమార్




ములకలపల్లి: భూ భారతి పేరుతో భూ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి పూకంటి రవికుమార్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చినప్పటికీ పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న ప్రతి రైతుకు భూమిపై హక్కు కల్పించేలా చట్టం తీసుకురావాలని కోరారు. ఎరువుల కొనుగోలు యాప్‌లను రద్దు చేసి గతంలో మాదిరిగా రైతులకు ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని, 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు గోపగాని లక్ష్మీ నరసయ్య, నాయకులు గద్దం వెంకటేశ్వర్లు, భూక్య శ్రీదేవి, వైరు ప్రసాద్, కొరసా వెంకటేశ్వర్లు, పెంకె భద్రయ్య, కంపసాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్యాసింజర్ రైలు దీక్షకు ఆర్యవైశ్యుల సంఘీభావం




**ఇల్లందు, ఆగస్ట్ 23 (ప్రజా జ్యోతి)** ఇల్లందు ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అయిన ప్యాసింజర్ రైలును తక్షణమే పునరుద్ధరించాలనే డిమాండ్‌తో మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, రజక సంఘం రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాస్ రిలే నిరాహార దీక్షకు ఆదివారం ఆర్యవైశ్యులు సంఘీభావం తెలిపారు. వాసవి క్లబ్, వనిత క్లౌన్ ఆధ్వర్యంలో ఇల్లందు ఆర్యవైశ్యులు ర్యాలీగా తరలి వచ్చి, ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ కోరుతూ కేంద్ర రైల్వే మంత్రివర్యులకు, సంబంధిత రైల్వే ఉన్నతాధికారులకు అందజేయాల్సిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు మాట్లాడుతూ ఇల్లందు బొగ్గుకు పుట్టినిల్లు అని, ఈ ప్రాంతంలో వేలాది కార్మిక కుటుంబాలు నివసిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల రాకపోకలకు ప్యాసింజర్ రైలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. రైలు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రయాణ భారం కూడా పెరిగిందని, ఇల్లందు ప్రజల సమస్యను కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే మంచి పని ఏదైనా, ప్రజా ప్రయోజనం కోసం జరిగే పోరాటం ఏదైనా ఆర్యవైశ్యులు ముందుండి మద్దతు ఇవ్వడం తమ బాధ్యతగా భావిస్తారని స్పష్టం చేశారు. ఒక్క పిలుపుతో పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటిన ప్రతి ఒక్క ఆర్యవైశ్య పెద్దకు, యువతకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్, వనిత క్లౌన్ అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్, కటకం అలేఖ్య, ప్రధాన కార్యదర్శి తీర్థాల నాగరాజు, కోశాధికారి బోనగిరి రమేష్, ఆర్య వైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుగూరి నగేష్ కుమార్, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ బోనగిరి రవి కిరణ్, వాసవి క్లబ్ ఆఫీసర్స్ చిదిరాల లింగయ్య, అర్వపల్లి రాధాకృష్ణ, జొన్నల ఉపేందర్ నాథ్ గుప్తా, చంద్రుపట్ల రోశయ్య, యెలుగురి మధుబాబు, సైపా రాజశేఖర్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు పల్లెర్ల చంద్రశేఖర్, తాటిపల్లి సుబ్బారావు, పసుమర్తి వాసు, కటకం బాలకృష్ణ, ఇల్లందు ఆర్యవైశ్యులు గౌరిశెట్టి కృష్ణ, గ్రందె సురేష్, దొడ్డా రాజు, ఓబిలిశెట్టి వెంకటేశ్వర్లు, రాయపూడి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# రాజపురంలో ముత్యాలమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు

- శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు
- అమ్మవారికి మొక్కులు చెల్లించిన గ్రామ ప్రజలు



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 23 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని రాజపురం గ్రామంలో శ్రావణ మాసం సందర్భంగా గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అట్లు, పండ్లు, చీరలు, గాజులు, పలహారాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.గ్రామంలోని ముత్యాలమ్మ దేవాలయానికి గ్రామానికి చెందిన న్యాయవాది కుమ్మరికుంట్ల కుమార్ లైట్స్ వేయించి, రంగులు వేయించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన కుమ్మరికుంట్ల కుమార్‌కు పలువురు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో దేవాలయ ప్రాంగణం సందడిగా మారింది. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పశువులు వృద్ధి చెంది, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



**ములకలపల్లి, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కొత్తగూడెంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ బీఎల్‌వో కోఆర్డినేటర్ సురభి రాజేష్ కోరారు. ఆగస్టు 27 వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చని, సెప్టెంబర్ 1 నుంచి మొదటి బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో 'చేయూత' కార్యక్రమంతో విద్యాసంస్థల్లో మార్పులు వస్తున్నాయని అన్నారు. వివరాలకు 8985096699ను సంప్రదించాలని సూచించారు.